సాక్షి
తిరుపతి
శనివారం ׀ 6 ׀ జూలై ׀ 2024



పరిశీలిస్తూ..సూచనలిస్తూ..
తిరుపతి జిల్లాలో నూతన కలెక్టర్ వెంకటేశ్వర్ విస్తృతంగా పర్యటించారు. తిరుపతి స్కావెంజర్స్ కాలనీని పరిశీలించారు. - 8లో



గంజాయి స్వాధీనం
గుడివాడ నుంచి తిరుపతికి సూపర్ లగ్జరీ బస్సులో తరలిస్తున్న 7.2 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. - 8లో



ఈ సారి బియ్యం ఒక్కటే
రేషన్ దుకాణాల్లో ఈనెలకు బియ్యం ఒక్కటే ఇచ్చి కూటమి నేతలు చేతులు దులుపుకున్నారు. - 8లో

పులివర్తి నానికి భారీ నజరానా!

'ఆయన ఒక ఎమ్మెల్యే.. ఆ నియోజకవర్గ ప్రజలకు మంచి చేయాల్సిన పూర్తి బాధ్యత ఆయనదే. పదిమందికీ అనుకూలమైన రహదారుల నిర్మాణం.. గ్రామాల్లో మౌలిక వసతుల ఏర్పాటు కోసం నిధులు సమీకరించి అభివృద్ధి పనులను పరుగులు పెట్టించాల్సిన బాధ్యత కూడా ఆయనదే. అయితే అందుకు పూర్తి భిన్నంగా వ్యవహరిస్తున్నారు ఆ ఎమ్మెల్యే. ప్రభుత్వ అధికారులను బెదిరించడం.. వ్యాపారులను టార్గెట్ చేయడం.. తన నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు ఆటంకం కల్గించడం.. కాంట్రాక్టర్లకు బిల్లులు రానీయనంటూ హెచ్చరికలు జారీ చేయడం.. వంటి చర్యలతో ఒక భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. తాజాగా ఓ కాంట్రాక్టర్‌కు చెందిన రెండెకరాల భూమిని తన పేరిట రాసివ్వాలని ఒత్తిడి చేయడంతో సదరు వ్యక్తి ఏమీ చేయలేక తన భూమిని స్వాధీనం చేశారు. ఇంతకూ ఎవ్వరు ఆ ఎమ్మెల్యే ? ఏమా కథ ? తెలుసుకోవాలంటే దీన్ని చదవాల్సిందే'.

- టీటీడీ రోడ్డు నిర్మాణ పనులు జరగకుండా అడ్డంకులు
- కోట్ల రూపాయల బిల్లులకు బ్రేక్ వేస్తానని బెదిరింపులు
- అగరాల వద్ద విలువైన పట్టా భూమి రాసివ్వాలని కాంట్రాక్టర్‌కు ఎమ్మెల్యే హుకుం
- రూ.7 కోట్ల విలువైన రెండెకరాల భూమి రాసిచ్చిన కాంట్రాక్టర్
- ఆ భూమిలో ఇంటి నిర్మాణానికి చకచకా పనులు



కాంట్రాక్టర్‌కు చెందిన భూమిలో పులివర్తి నాని నివాసానికి చదును చేసిన దృశ్యం

సాక్షి, టాస్క్‌ఫోర్స్: 'పులివర్తి నాని ఓ మేకవన్నెపులి. ఇన్నాళ్లూ ప్రతిపక్షంలో ఉండడంతో ఆయన నిజ స్వరూపాన్ని ప్రజలు గ్రహించలేకపోయారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన వెంటనే తన అసలు స్వరూపాన్ని బయటపెట్టేశారు. ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుంచి దందాలు.. సెటిల్‌మెంట్లతో మొదలుపెట్టి.. ఇప్పుడు బెదిరింపులు.. బరితెగింపులకు దాకా వచ్చేశారు. ఏ పనులు సాఫీగా జరగాలన్నా.. నగానట్రా..బిల్లులు వగైరా రావాలన్నా తాను అడిగినంత ఇచ్చుకోవాల్సిందేనని హుకుం జారీచేస్తున్నారు. కాదు..కూడదంటే అధికారమదంతో పేట్రేగిపోతున్నారు. దాడులు చేయిస్తూ.. ఆస్తులు ధ్వంసం చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. అధికార అండదండలతో బెదిరింపులకు దిగుతున్నారు. దీంతో గత్యంతరం లేక కాంట్రాక్టర్లు.. వ్యాపారులు ఆయన అడిగినంత సమర్పించుకుంటున్నారు. ఇటీవల చోటుచేసుకున్న ఓ ఘటన మచ్చుకు మీ కోసం.. వివరాలు..

తిరుపతి రూరల్ మండలం, చెర్లోపల్లి పంచాయతీకి చెందిన సర్పంచ్ సుభాషిణి భర్త శుభగిరి క్లాస్–1 కాంట్రాక్టర్. ఈ క్రమంలో చెర్లోపల్లి జంక్షన్ నుంచి వకుళమాత గుడి వరకు టీటీడీ నుంచి టెండర్ ద్వారా నూతనంగా రహదారి నిర్మాణం చేపట్టేందుకు అనుమతులు తీసుకున్నారు. పనులు కూడా దాదాపు పూర్తికావస్తున్న తరుణంలో చంద్రగిరి ఎమ్మెల్యేగా గెలిచిన పులివర్తి నాని ఆ కాంట్రాక్టర్‌ను టార్గెట్ చేశారు. టీటీడీ రోడ్డు పనులు నిలిపివేయించడంతో పాటు ప్రభుత్వం నుంచి రావాల్సిన కోట్లాది రూపాయల బిల్లులను నిలుపుదల చేయిస్తానని బెదిరించారు. తన బిల్లులకు ఇబ్బంది లేకుండా అన్ని పనులు సాఫీగా సాగాలంటే చంద్రగిరి మండలం, అగరాల వద్ద సదరు కాంట్రాక్టర్‌కు చెందిన రూ.7 కోట్ల విలువైన రెండెకరాల భూమిని తనకు స్వాధీనపరచాలని ఎమ్మెల్యే నాని హుకుం జారీచేశారు. దీంతో కోట్ల రూపాయల బిల్లులు ఆగిపోయి ఆర్థికంగా ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆందోళన చెందిన ఆ కాంట్రాక్టర్ రూ.7 కోట్ల విలువైన తన భూమిని ఎమ్మెల్యే నానికి స్వాధీనం చేశారు. ఆ స్థలంలోనే ఎమ్మెల్యే పులివర్తి నాని నూతన ఇంటి నిర్మాణం కూడా చేపట్టనున్నట్లు సమాచారం.

చకచకా ఇంటి నిర్మాణ పనులు

సర్పంచ్ భర్త నుంచి నిస్సిగ్గుగా స్వాధీనం చేసుకున్న భూమిలో ఇంటి నిర్మాణానికి అనుకూలంగా ఆ భూమిలో చదును చేసే పనులను శరవేగంగా నిర్వహిస్తున్నారు. కాగా చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ఆయన గెలిచిన 30 రోజుల్లో అన్ని వర్గాల వారిని ఇంతలా వేధింపులకు గురిచేస్తుండడం, ఇంతగా తెగించి అవినీతికి పాల్పడుతుండడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మండిపడుతున్న అధికార పార్టీ నాయకులు

టీటీడీ నిధులతో నిర్మాణం జరుగుతున్న రోడ్డు పనులను అడ్డుకుని సదరు కాంట్రాక్టరు ద్వారా రెండు ఎకరాల భూమిని ఎమ్మెల్యే పులివర్తి నాని తీసుకున్న విషయం బయటకు రావడం, ఇప్పటికే టీటీడీలో పర్సెంటేజీల వ్యవహారంపై సమగ్ర విచారణ జరుగుతుండడంతో దీనిపై కూడా పూర్తి విచారణ చేయాలని స్థానిక టీడీపీ నేతలు, కార్యకర్తలు ప్రభుత్వాన్ని, టీటీడీపై విచారణ చేస్తున్న విజిలెన్స్ అధికారులను కోరుతుండడం విశేషం. ఈ విషయాన్ని పార్టీ అధినేత చంద్రబాబు, ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బాబు దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు స్థానిక టీడీపీ నాయకులు చెబుతున్నారు.

న్యూస్‌రీల్

హెల్ప్ లైన్ సెంటర్‌కు విశేష స్పందన



హెల్ప్‌లైన్ సెంటర్ వద్ద సందేహాలను నివృత్తి చేసుకుంటున్న విద్యార్థులు

తిరుపతి సిటీ: ఏపీ ఈఏఎమ్‌సెట్–2024 ఇంజినీరింగ్ అడ్మిషన్ల కౌన్సెలింగ్ నేపథ్యంలో ఎస్వీయూలోని ఓల్డ్ ఎంబీఏ బిల్డింగ్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్ లైన్ సెంటర్‌కు విశేష స్పందన లభిస్తోంది. గత రెండు రోజులకుగా సుమారు 600 మందికి పైగా విద్యార్థులు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఎదురైన సమస్యలను, సందేహాలను సిబ్బంది దృష్టికి తీసుకెళ్లి నివృత్తి చేసుకున్నారు. ఇప్పటికే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తికాగా గురువారం సాయంత్రం నుంచి రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కొనసాగుతోంది. వర్సిటీలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ డెస్క్‌లో మొదటి దశలో భాగంగా 2వేల మంది విద్యార్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. హెల్ప్‌లైన్ సెంటర్ క్యాంప్ ఆఫీసర్ వివేకానందరెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది సుమన్, తులసి తదితరులు విద్యార్థుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నారు.

నేటి నుంచి తైక్వాండో పోటీలు

నాయుడుపేట టౌన్: పట్టణంలోని కూరగాయల మార్కెట్ సమీపంలో ఉన్న షాదీమంజిల్‌లో శని, ఆదివారాలు రెండు రోజుల పాటు తైక్వాండో జిల్లా స్థాయి పోటీలను నిర్వహించనున్నట్లు తైక్వాండో అసోసియేషన్ నాయకులు శుక్రవారం తెలిపారు. నెల్లూరు జిల్లా– 2024 తైక్వాండో 8వ చాంపియన్‌షిప్ పోటీలను నాయుడుపేటలో 6, 7 తేదీలలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. తైక్వాండో మినీ సబ్‌జూనియర్, క్యాడెట్, జూనియర్, సీనియర్ విభాగాల్లో పోటీలను నిర్వహిస్తామని జిల్లా కోశాధికారి, ఆర్గనైజింగ్ సెక్రటరి ఉయ్యాల పవన్‌కుమార్ పేర్కొన్నారు.

ముక్కంటి సన్నిధిలో అనిల్‌రావిపూడి



ఆలయ ధ్వజస్తంభం వద్ద సినీ దర్శకుడు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శుక్రవారం సినీ దర్శకుడు అనిల్ రావిపూడి దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు ఆయనను ఆశీర్వదించగా.. అధికారులు స్వామి,అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

గుండె మార్పిడి విజయవంతం

- టీటీడీ శ్రీపద్మావతి చిన్నపిల్లల ఆస్పత్రిలో 16వ గుండె మార్పిడి
- 15 సంవత్సరాల యువతికి 40 ఏళ్ల వ్యక్తి గుండె అమరిక



రేణిగుంట విమానాశ్రయంలో ఇండిగో విమానం నుంచి గుండెను తీసుకొస్తున్న వైద్యులు

తిరుపతి తుడా: టీటీడీ శ్రీపద్మావతి చిన్నపిల్లల గుండె చికిత్సాలయంలో శుక్రవారం సాయంత్రం 16వ గుండె మార్పిడి చికిత్సను విజయవంతంగా పూర్తిచేశారు. ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్ రెడ్డి నేతృత్వంలోని ఆరుగురు వైద్యుల బృందం 15 సంవత్సరాల యువతికి 40 ఏళ్ల వ్యక్తి గుండెను అమర్చి పునర్జన్మను ప్రసాదించారు. వైఎస్సార్ జిల్లా, పుల్లంపేట ప్రాంతానికి చెందిన నిరుపేద యువతికి వైద్యులు ప్రాణభిక్ష పెట్టారు. గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న యువతి వివిధ ప్రాంతాల్లోని వైద్యులను సంప్రదించి చికిత్స చేయించారు. సమస్య తీవ్రం కావడంతో నాలుగు నెలల క్రితం శ్రీ పద్మావతి చిన్న పిల్లల ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఇక్కడ వైద్యులు అన్ని పరీక్షలు నిర్వహించగా గుండె సామర్థ్యం పూర్తిగా క్షీణించిందని, గుండె మార్పిడి అనివార్యమని నిర్ధారించారు. ఈ క్రమంలో 'అవయవదాన్'లో యువతి వివరాలను నమోదు చేశారు. ఈ క్రమంలో గుంటూరు జిల్లాకు చెందిన 40 ఏళ్ల వ్యక్తి రోడ్డు ప్రమాదానికి గురై మంగళగిరి ఎన్ఆర్‌ఐ హాస్పిటల్‌లో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆ వ్యక్తి బ్రెయిన్ డెడ్ అయినట్లు నిర్ధారించారు . కుటుంబ సభ్యులు అవయవ దానానికి ముందుకొచ్చారు. ఈ క్రమంలో గుండె అందుబాటులోకి వచ్చిన విషయాన్ని తెలుసుకున్న తిరుపతిలోని చిన్న పిల్లల హృదయాలయ వైద్యులు అక్కడికి చేరుకొని బ్రెయిన్‌డెడ్ వ్యక్తి నుంచి గుండెను సేకరించారు. సాయంత్రం ఇండిగో విమానంలో గన్నవరం నుంచి రేణిగుంట విమానాశ్రయానికి తీసుకొచ్చారు. అక్కడి నుంచి గ్రీన్ చానల్ ద్వారా శ్రీ పద్మావతి చి ల్డ్రన్స్ కార్డియాక్ కేర్ సెంటర్‌కు తరలించారు.

ఐదు గంటలు శ్రమించిన వైద్యులు

గుండె మార్పిడి వైద్య ప్రక్రియను డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి వైద్యుల బృందం ఐదు గంటల పాటు శ్రమించి విజయవంతంగా పూర్తిచేసింది. సాయంత్రం 6 గంటల ప్రాంతంలో మొదలైన ఈ గుండె మార్పిడి ప్రక్రియ రాత్రి 11 గంటలకు ముగిసింది. గుండె మార్పిడి విజయవంతం కావడంతో వైద్యులు సంతోషం వ్యక్తం చేశారు. గుండెను దానం చేసేందుకు వచ్చిన బాధితుడి కుటుంబ సభ్యులకు జీవితాంతం రుణపడి ఉంటామని యువతి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

రెండు రోజుల్లో ఇన్‌చార్జ్ వీసీల నియామకం!

తిరుపతి సిటీ: జిల్లాలోని యూనివర్సిటీలకు ఇన్‌చార్జ్ వీసీలను నియమించేందుకు ప్రభుత్వం కసరత్తు ముమ్మరం చేస్తోంది. ఇందులో భాగంగా సీనియర్లు, ఆశావహుల జాబితాను పరిశీలించి ఇప్పటికే స్పష్టమైన నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. నూతన ప్రభుత్వ ఏర్పడి నెలరోజులు కాకముందే ఉన్నత విద్యామండలి అధికారుల నుంచి వర్సిటీల వీసీలపై ఒత్తిడి తీసుకొచ్చి రాజీనామాలను చేయించిన విషయం విదితమే. రాజీనామాలు సమర్పించిన వీసీల ఫైల్‌పై గవర్నర్ ఆమోదముద్ర కోసం వేచి చూస్తున్నట్లు సమాచారం. ఆమోద ముద్ర పడిన వెంటనే జిల్లాలోని అన్ని వర్సిటీలకు ఇన్‌చార్జ్ వీసీలను ప్రభుత్వం నియమించనుంది. అకడమిక్ ఇయర్ ప్రారంభమైన నేపథ్యంలో వర్సిటీలలో పాలన కుంటుపడకుండా రెండు రోజుల్లో ఇన్‌చార్జ్‌లను నియమించాలని ప్రభుత్వం యోచిస్తోంది.

ఎస్వీయూ ఇన్‌చార్జ్ వీసీగా అప్పారావు!

ఎస్వీయూ ఇన్‌చార్జ్ వీసీగా ప్రస్తుత అకడమిక్ డీన్, పార్మశీ కళాశాల ప్రిన్సిపల్ అప్పారావు పేరు ముందు వరుసులో ఉందని, దాదాపు ఆయన పేరు ఖరారైనట్లు విశ్వసనీయ సమాచారం. సీనియర్ ప్రొఫెసర్‌గా, ప్రిన్సిపల్‌గా, డీన్‌గా, పాలనాపరమైన నిర్ణయాలలో అనుభవం ఉన్న అధ్యాపకుడిగా ఆయనకు గుర్తింపు ఉంది. అలాగే ఫిజిక్స్ విభాగం హెచ్‌ఓడీ విజయభాస్కర్‌రావు, ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ప్రిన్సిపల్ ఆర్వీఎస్ సత్యనారాయణ సైతం రేసులో ఉన్నట్లు వర్సిటీలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. అదేవిధంగా ఎస్వీ వేదిక్ వర్సిటీకి టీటీడీ ఈఓ శ్యామలరావు ఇన్‌చార్జ్ వీసీగా నియమితులు కానున్నట్లు సమాచారం. మహిళా వర్సిటీతో పాటు ఎస్వీ వెటర్నరీ వర్సిటీకి ఇన్‌చార్జ్‌లను నియమించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

పోటు కార్యకలాపాలపై టీటీడీ ఈఓ సమీక్ష

తిరుమల: శ్రీవారి పోటులో లడ్డూ ప్రసాదాలు తయారు చేసే పోటు కార్మికుల విధుల గురించి టీటీడీ ఈఓ జే.శ్యామలరావు సుదీర్ఘంగా అధ్యయనం చేశారు. శుక్రవారం సాయంత్రం గోకులం విశ్రాంతి భవనంలోని సమావేశ మందిరంలో ఈఓ, జేఈఓ వీరబ్రహ్మంతో కలిసి పోటు కార్యకలాపాలపై సమీక్ష నిర్వహించారు. ఇందులో భాగంగా, బూందీ తయారీ, చక్కెర కలపడం, జీడి పప్పును బూందీలో కలపడం, లడ్డూను తయారుచేసి, లడ్డూ కౌంటర్లోకి పంపడం, లడ్డూ ప్రసాదం పంపిణీ తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సంబంధిత అధికారులు ఈఓకు వివరించారు. భద్రతాపరమైన అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, ఏఈఓ పోటు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కక్షపూరిత దాడులు అరికట్టండి



ఎస్పీతో మాట్లాడుతున్న తిరుపతి ఎంపీ గురుమూర్తి

తిరుపతి క్రైమ్: జిల్లాలో కూటమి నాయకులు కొనసాగిస్తున్న కక్షపూరిత దాడులు అరికట్టాలని వైఎస్సార్‌సీపీ తిరుపతి ఎంపీ గురుమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజుకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసి దాడుల గురించి వివరించారు. జిల్లాలో రాజ్యాంగ వ్యవస్థలు కుప్పకూలిపోయాయని, చంద్రబాబు రాజకీయ కక్ష సాధింపుతో ప్రజాస్వామ్యానికే ముప్పుతెస్తున్నారని పేర్కొన్నారు. టీడీపీ దాడులతో ఆటవిక పరిస్థితులు తలెత్తాయని వాపోయారు. యంత్రాంగం మొత్తం నిర్వీర్యం అయిపోతోందని చెప్పారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల పైన ఉన్మాదంతో దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజాస్వామ్యానికి, పౌర స్వేచ్ఛకు తీవ్రభంగం వాటిల్లుతోందని, ఇప్పటికైనా దాడులు నివారించి శాంతి భద్రతకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆధ్యాత్మిక నగరం మాత్రమే కాకుండా తిరుపతి చుట్టుపక్కల ప్రాంతాలలో ప్రతిష్టాత్మక విద్యాసంస్థలున్నాయని, ఇలాంటి ప్రాంతాలలో గంజాయి వంటి మాదక ద్రవ్యాల నివారణకు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

క్లుప్తంగా

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు అన్నీ నిండాయి. క్యూ ఏటీసీ వద్దకు చేరింది. గురువారం అర్ధరాత్రి వరకు 63,826 మంది స్వామివారిని దర్శించుకోగా 27,530 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.23 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టోకెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టోకెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టోకెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

తప్పతాగిన ఇద్దరు మందుబాబులకు జైలు

తిరుపతి లీగల్: అధిక మోతాదులో మద్యం తాగి తిరుపతిలో వాహనాలు నడుపుతున్న కేసుల్లో ఇద్దరికి వేర్వేరుగా జైలు శిక్ష, రూ.10 వేలు చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి నాల్గవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ శుక్రవారం తీర్పుచెప్పారు. తిరుపతి ట్రాఫిక్ డీఎస్పీ రమణకుమార్, సీఐ సుబ్బారెడ్డి ఆదేశాల మేరకు ట్రాఫిక్ పోలీసులు తిరుపతిలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించినట్లు కోర్టు కానిస్టేబుల్ గిరిబాబు తెలిపారు. తిరుపతి పోస్టల్ కాలనీకి చెందిన టీ.సారథి అధిక మోతాదులో మద్యం తాగి ఆటో నడపగా పోలీసులు అతనిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి అతనికి నాలుగు రోజులు జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. అలాగే కోలావీధికి చెందిన ఎం.శ్రీనివాసులకు మూడు రోజులు జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. అదేవిధంగా తక్కువ శాతంలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 15 మందిపై పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి ఒక్కొక్కరికీ రూ.10 వేలు చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. అదేవిధంగా తిరుపతి రూరల్ ఎంఆర్ పల్లి, రేణిగుంట పోలీసు స్టేషన్‌ల పరిధిలో ట్రాఫిక్ అంతరాయం కలిగిస్తున్న పలువురికి రూ.27,190 జరిమానా విధిస్తూ తిరుపతి రెండవ ప్రత్యేక మెజిస్ట్రేట్ కోర్టు ఇన్‌చార్జ్ న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ తీర్పు చెప్పారు.

చౌకదుకాణాల్లో బియ్యం ఒక్కటే



- మిగిలిన సరుకులకు మంగళం
- బియ్యంతో సరిపెట్టడం ఇదే ప్రథమం
- గత ప్రభుత్వంలో బియ్యంతోపాటు, గోధమపిండి, రాగిపిండి, కంది పప్పు, చక్కెర
- ఇదేమి విడ్డూరమంటున్న కార్డుదారులు

తిరుపతి అర్బన్: చౌకదుకాణాల ద్వారా సరుకులు తెచ్చుకుందామనుకున్న అభాగ్యులకు నిరాశే ఎదురైంది. కూటమి ప్రభుత్వం ఈనెల కోటాలో కేవలం బియ్యం మాత్రమే పంపిణీ చేయడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. ఇలాంటి పరిస్థితులు గతంలో ఎన్నడూ చూడలేదని కార్డుదారులు నిట్టూర్చుతున్నారు.

జిల్లా సమాచారం

రేషన్‌కార్డులు	- 6,03,000
ప్రతి నెలా బియ్యం	- 8,350 మెట్రిక్ టన్నులు
రేషన్ దుకాణాలు	- 1,457
ఎండీయూ వాహనాలు	- 369

గతంలో ఇంటింటికీ రేషన్

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జిల్లాలో 369 ఎండీయూ వాహనాలను ఏర్పాటు చేసి కార్డుదారులకు ఇంటింటికీ నేరుగా సరుకులు అందించే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. బియ్యంతోపాటు గోధుమ పిండి, రాగి పిండి, రాగులు, కంది పప్పు, చక్కెర తదితర నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తూ వచ్చింది. కానీ ప్రస్తుత ప్రభుత్వం వీటినేటినీ ఇవ్వకుండా మొండిచెయ్యి చూపింది.

ఈ నెల బియ్యం మాత్రమే వచ్చాయి



జూలై నెలకు సంబంధించి చౌకదుకాణాలకు కేవలం బియ్యం మాత్రమే వచ్చాయి. దీంతో అవే పంపిణీ చేస్తున్నాం. ప్రతి నెలా 1 నుంచి 18వ తేదీ వరకు కార్డుదారులకు సరుకులు అందిస్తాం. ఆ తర్వాత 20 నుంచి 25వ తేదీ వరకు బియ్యం మినహా మిగిలిన సరుకులకు డీలర్లు చెక్కులు ఇస్తారు. ఆ మేరకు సరుకులు వస్తాయి. మేలో 86.4శాతం, జూన్‌లో 85.6శాతం కార్డుదారులకు సరుకులు ఇచ్చాం.

-రాజారఘువీరా, సివిల్ సప్లయ్ జిల్లా అధికారి

ఇతర సరుకులు అందలేదు



జూలై నెలకు సంబంధించి బియ్యం మాత్రమే రేషన్ గోదాములకు చేరుకున్నాయి. ఆ మేరకు జూన్ 30వ తేదీకి చౌకదుకాణాలకు అందించాం. ఇతర సరుకులు అందలేదు. అందితే వాటిని చౌకదుకాణాలు ఇస్తాం. ఇతర సరుకులకు ప్రతి నెలా 25వ తేదీ లోపు చెక్కులు ఇవ్వాలని డీలర్లను కోరుతున్నాం. ఆ తర్వాత 30వ తేదీకి గోదాముల నుంచి డీలర్లకు పంపిణీ చేస్తాం. మరోవైపు తూకాల్లో తేడాలు లేకుండా పటిష్ఠమైన చర్యలు చేపడుతున్నాం.

-వై.సుమతి, సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్

బియ్యం మాత్రమే ఇస్తే ఎలా

20 ఏళ్లగా మాకు రేషన్‌కార్డు ఉంది. గతంలో సబ్బులు, కుంకుడుగాయలు, సీకాయి, చక్కెర తదితర వస్తువులు కూడా చౌకదుకాణాల్లో ఇచ్చేవారు. 2019–2024లో బియ్యంతోపాటు చక్కెర, రాగులు, రాగిపిండి, గోధుమపిండి, కందిపప్పు తదితర వస్తువులు ఇచ్చారు. ఇప్పుడున్న ప్రభుత్వం ఈనెలకు బియ్యం మాత్రమే ఇచ్చింది. ఇలా అయితే ఎలా..?.

-రత్నం, శ్రీకాళహస్తి

అన్ని సరుకులు ఇవ్వాలి

పేదోడికి ప్రభుత్వం అన్ని నిత్యావసర సరుకులు ఇవ్వాలని కోరుతున్నాం. వైట్ రేషన్‌కార్డు ఉందంటే వారంతా పేదవారే కదా..?. మార్కెట్‌లో రేట్లు తారస్థాయిలో ఉన్నాయి. కొనలేని పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో ప్రభుత్వం బియ్యం మాత్రమే ఇస్తే సరిపోదు. ఇతర వస్తువులు కూడా ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నా.

-కుమార్, తిరుపతి

బాధ్యతగా పనిచేయండి



కలెక్టర్‌ను సన్మానిస్తున్న ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నేతలు

తిరుపతి అర్బన్: 'సమస్యలుంటే చెప్పండి పరిష్కరిస్తాం.. అయితే డ్యూటీ విషయంలో మాత్రం బాధ్యతగా పనిచేయాలి' అని ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నేతలకు కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఏపీ రెవెన్యూ అసోసియేషన్ నేతలు మర్యాద పూర్వకంగా కలెక్టర్‌ను కలిశారు. ఆయన్ని దుశ్శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ విభాగం ఎంత కీలకమో అందరికీ తెలుసుని చెప్పారు. నిర్లక్ష్యం లేకుండా బాధ్యతగా పనిచేయాలని స్పష్టం చేశారు. అదేవిధంగా రెవెన్యూ ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకొస్తే వాటికి పరిష్కారం చూపుతామన్నారు. ఉద్యోగ సంఘాల నేతలు సమస్యలను తెలియజేయడంలో తప్పులేదని, అయితే విధులు నిర్వహించడంలో మాత్రం అప్రమత్తంగా ఉండాలని వివరించారు. ఏపీ రెవెన్యూ అసోసియేషన్ కార్యదర్శి గోపీనాథ్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ అన్వర్‌బాషా, తిరుపతి డివిజన్ అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, కోశాధికారి చందు, జీవన్‌కుమార్, సహ ఉపాధ్యక్షులు శ్యామ్‌ప్రసాద్, నేతలు రామచంద్ర, రమేష్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా తిరుపతి డివిజన్ వీఆర్వో సంఘం అధ్యక్షుడు చెంగ్రాయల్‌తోపాటు పలువురు కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

7.2 కిలోల గంజాయి స్వాధీనం

నాయుడుపేట టౌన్: ఆర్టీసీ బస్సులో అక్రమంగా తరలిస్తున్న 7.2 కేజీల గంజాయిని నాయుడుపేట సమీపంలోని జువ్వలపాళెం క్రాస్ రోడ్డు వద్ద ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ అరుణకుమారి సిబ్బందితో కలిసి స్వాధీనం చేసుకున్నారు. గంజాయి తరలిస్తున్న తమిళనాడు ప్రాంతానికి చెందిన ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు వారు పేర్కొన్నారు. స్థానిక ఎస్ఈబీ కార్యాలయం వద్ద శుక్రవారం సాయంత్రం నిందితులను హాజరుపరిచి ఆ వివరాలు వెల్లడించారు. శుక్రవారం రహదారుల కూడళ్ల వద్ద బస్సులు తదితర వాహనాలు తనిఖీ చేస్తుండగా.. జువ్వలపాళెం క్రాస్ రోడ్డు వద్ద గుడివాడ నుంచి తిరుపతికి వెళుతున్న ఏపీఎస్ఆర్‌టీసీ సూపర్ లగ్జరీ బస్సును తనిఖీ చేయగా.. అందులో ప్రమాణికుల మాదిరిగా ఉన్న తమిళనాడు ప్రాంతానికి చెందిన ఎలవర్సన్, కవీన్, ఆకాష్ అనే ముగ్గురు వ్యక్తులు అనుమానస్పదంగా కనిపించారన్నారు. వారి వద్ద మూడు బ్యాగులు ఉన్నట్లు గుర్తించి తనిఖీలు చేయగా ఆ బ్యాగుల్లో అక్రమంగా గంజాయిని రవాణా చేస్తున్నట్లు గుర్తించామన్నారు. ఆ ముగ్గురు వ్యక్తులు విజయవాడ నుంచి తిరుపతికి అక్రమంగా గంజాయిని సరాఫరా చేస్తున్నారని పేర్కొన్నారు. వారు 7.2 కేజీల గంజాయిని రూ.20 వేలకు కొనుగోలు చేసినట్లు విచారణలో తేలిందన్నారు. దీని విలువ మార్కెట్‌లో రూ.80 వేలకు పైగా ఉంటుందన్నారు. వీరి వద్ద దొరికిన గంజాయితో పాటు ఒక సెల్ ఫోన్‌ను సీజ్ చేసినట్లు వివరించారు. తనిఖీల్లో ఎస్ఈబీ ఎస్ఐ మునీర్ అహ్మద్, సిబ్బంది పాల్గొన్నారు.

చచ్చినా చావే!



పంట పొలాల్లో మృతదేహాన్ని మోసుకెళ్తున్న స్థానికులు

ఏర్పేడు: బతికున్నంత కాలం కష్టాలే. ఇప్పుడు చచ్చినా శ్మశానానికి వెళ్లాలన్నా కష్టాలే పడాల్సి వస్తోందంటూ మండలంలోని మర్రిమంద దళితులు ఆవేదన చెందుతున్నారు. తరతరాలుగా శ్మశానానికి సక్రమమైన రోడ్డు సౌకర్యంలేక దళితులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోతోంది. ఈ క్రమంలో మర్రిమంద దళితవాడకు చెందిన బోనాసి సుబ్రమణ్యం(59) అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందాడు. మృతదేహాన్ని రైతుల వరి పంట పొలాల్లో చస్తూ..బతుకుతూ తీసుకుని శ్మశానానికి చేరుకున్నారు. అధికారులు ఇకనైనా స్పందించి శ్మశాన వాటికకు సరైన దారి సౌకర్యం కల్పించాలని వేడుకుంటున్నారు.

ఎర్రచందనం కేసులో నలుగురికి జైలు

తిరుపతి లీగల్: అటవీ ప్రాంతంలోకి అక్రమంగా ప్రవేశించి ఎర్రచందనం దుంగలను నరికి తరలించడానికి ప్రయత్నించిన కేసులో నలుగురికి ఏడాది జైలు, ఒక్కొక్కరికీ రూ.2,500 జరిమానా విధిస్తూ ఎర్రచందనం కేసుల విచారణ జూనియర్ జడ్జి శ్రీకాంత్ తీర్పు చెప్పారు. తమిళనాడు తిరువణ్ణామలై జిల్లా, పోలూరు తాలూకా, మొట్టనాటూరుకు చెందిన ఎల్.చిన్నస్వామి, సీ.రామర్, ఏ.ముత్తుస్వామి, ఆర్.ప్రభు 2014 ఫిబ్రవరి 14వ తేదీ చిత్తూరు బీట్, చిత్తూరు ఈస్ట్ రేంజ్, రెడ్డిగుంట అటవీ ప్రాంతంలోకి అక్రమంగా ప్రవేశించారు. నాలుగు ఎర్రచందనం దుంగలను నరికి తరలించడానికి ప్రయత్నించగా చిత్తూరు ఫారెస్ట్ రేంజ్ అధికారులు వారిని అదుపులోకి తీసుకున్నారు. నలుగురిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ఆ నలుగురికీ శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

స్విమ్స్‌లో సీనియర్ రెసిడెంట్ పోస్టులకు ఇంటర్వ్యూ

తిరుపతి తుడా: స్విమ్స్ యూనివర్సిటీలో సీనియర్ రెసిడెంట్ వైద్యులు, ట్యూటర్స్ ఖాళీలకు సంబంధించి అడహక్ బేసిస్ పద్ధతిన మొత్తం 35 పోస్టులను భర్తీ చేయనున్నట్లు స్విమ్స్ రిజిస్ట్రార్ అపర్ణ ఆర్ బిట్ల తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ ఈనెల 10వ తేదీన స్విమ్స్ కమిటీ హాల్లో ఉదయం 10 గంటలకు వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అర్హతతో పాటు హిందూ మతానికి చెందిన వారు మాత్రమే ఈ పోస్టులకు అర్హులని చెప్పారు. ఆసక్తిగలవారు ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు రెండు జతల జిరాక్స్ కాపీలను వెంట తీసుకురావాలని కోరారు. ఇతర వివరాలకు స్విమ్స్ వెబ్ సైట్ సందర్శించాలని సూచించారు. మొత్తం 29 సీనియర్ రెసిడెంట్ వైద్యుల పోస్టుల్లో అనాటమీ – 2, బయో కెమిస్ట్రీ– 2, కమ్యూనిటీ మెడిసిన్–4, డెంటిస్ట్ –1, ఫోరెన్సిక్ మెడిసిన్– 4, మైక్రో బయాలజీ –4 పీడియాట్రిక్–2, పాథాలజీ–2, ఫార్మాకాలజీ –4, ఫిజియాలజీ–3, తో పాటు ట్యూటర్స్‌కు సంబంధించి అనాటమీ–2, కమ్యూనిటీ మెడిసిన్–1 ఫోరెన్సిక్ మెడిసిన్– 2, మైక్రో బయాలజీ –1 పోస్టులకు ఇంటర్వ్యూలు ఉంటాయని వివరించారు.

మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం

–జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి సుబ్బరాజు



సిబ్బందికి నగదు రివార్డు ఇస్తున్న సుబ్బరాజు తదితరులు

చిత్తూరు అర్బన్: జిల్లాలో మాదక ద్రవ్యాలు, గంజాయి, ఇతర మత్తు పదార్థాలు వినియోగిస్తే ఉక్కుపాదం మోపాలని జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి సుబ్బరాజు ఆదేశించారు. శుక్రవారం ఎస్ఈబీ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కర్ణాటక మద్యం, గంజాయి అక్రమ రవాణాపై క్షేత్రస్థాయిలో సమాచారం తెప్పించుకోవాలన్నారు. నిందితులు ఎంతటివారైనా ఉపేక్షించరాదన్నారు. అలాగే సారా తయాదీదారులు, విక్రేతలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. గంజాయి, మత్తు పదార్థాలు తెప్పించే పెద్ద ముఠాలను పట్టుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసుల్లో దర్యాప్తు పూర్తిచేసి, కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేయాలని ఆదేశించారు. అనంతరం విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరచిన పలువురు సిబ్బందికి నగదు రివార్డులు అందచేశారు. సమావేశంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీధర్, ఏఈఎస్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పూరిల్లు దగ్ధం



కాలిపోయిన పూరిల్లు వద్ద బాధితురాలు

వరదయ్యపాళెం: మండలంలోని పెద్ద పాండూరు పంచాయతీ పరిధిలోని వేంకటేశ్వర గిరిజన కాలనీలో ఎం.బుజ్జమ్మ పూరిల్లు పూర్తిగా దగ్ధమైంది. శుక్రవారం ఉదయం ఇంటి బయట కట్టెల పొయ్యితో వంట పనులు ముగించుకుని ఇంటి సమీపంలో బుజ్జమ్మ ఉండగా ఒక్కసారిగా పూరింటి పైకప్పులో పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. దీంతో ఇల్లు పూర్తిగా కాలిపోయింది. ఇంటి లోపల ఉన్న వస్తు సామగ్రితో పాటు దుస్తులు కూడా కాలిపోయాయి. దీంతో ఆ మహిళ కట్టుబట్టలతో వీధిన పడింది. సమాచారం అందుకున్న వీఆర్వో ఆదిలక్ష్మి కాలిన ఇంటిని పరిశీలించి బాధితురాలు తెలిపిన వివరాలు మేరకు మండల తహసీల్దార్‌కు నివేదిక అందజేశారు.

పరిశీలిస్తూ.. సూచనలిస్తూ!

జిల్లాలో కలెక్టర్ సుడిగాలి పర్యటన

- రేణిగుంటలో గిరిజన గురుకుల పాఠశాల తనిఖీ
- విద్యార్థులతో కలిసి పాఠాలు విన్న కలెక్టర్



రేణిగుంట గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్



స్టాకు, విద్యార్థుల బ్యాగులను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

రేణిగుంట: కొత్తగా బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ శుక్రవారం జిల్లాలు సుడిగాలి పర్యటన చేశారు. మొదల ఆయన తిరుపతిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పారిశుద్ధ్య చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఆ తర్వాత రేణిగుంట ఎయిర్‌పోర్టు సమీపంలో ఉన్న గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని, ప్రభుత్వం నుంచి అందిన యూనిఫారం, షూ, బ్యాగ్, పుస్తకాలు సంబంధిత విద్యార్థులకు సత్వరమే పంపిణీ చేసి వాటిని వినియోగించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థుల నమోదు శాతం వంద శాతం ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుని విద్యార్థుల విద్య, ఆరోగ్యం పట్ల అధికారులు శ్రద్ధ వహించాలని సూచించారు. పాఠశాలలో మొత్తం 480మంది విద్యార్థులకు గాను 430 మంది ఉన్నట్లు ప్రిన్సిపల్ హరిబాబు వివరించారు. దీంతో కలెక్టర్ అటెండెన్స్ రిజిస్టర్ పరిశీలించి గైర్హాజరైన విద్యార్థులను తిరిగి పాఠశాలకు తీసుకొచ్చేలా, మిగిలి ఉన్న సీట్లు కూడా భర్తీ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. వార్డెన్ లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేయగా వారు సెలవులో ఉన్నారని వివరించారు.

సౌకర్యాలపై ఆరాతీస్తూ..ఆప్యాయత పంచుతూ..

విద్యార్థులతో కలెక్టర్ ఆప్యాయంగా మాట్లాడుతూ ఉదయం ఏమి టిఫిన్ చేశారని ఆరా తీయగా పొంగల్ చట్నీ పెట్టారని తెలిపారు. ఎలా చదువు చెప్తున్నారు, ఆహారం బాగుందా..? పుస్తకాలు, యూనిఫాం ఇచ్చారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. తరగతి గదిలో విద్యార్థులతో కలసి డెస్క్‌లో కూర్చుని హిందీ ఉపాధ్యాయురాలు టీచింగ్ స్కిల్స్ పరిశీలించారు. గురుకుల పాఠశాల నుంచి జిల్లా గిరిజన సంక్షేమ అధికారి సూర్యనారాయణతో ఫోన్‌లో మాట్లాడి గైర్హాజరైన విద్యార్థులను తిరిగి పాఠశాలకు తెచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం హాస్టల్‌లోని భోజనశాలలో అన్నం, పప్పు, స్టాక్ వివరాలను పరిశీలించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి అని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్రైడేని డ్రైడేగా పాటిద్దాం



గర్భిణితో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి తుడా: 'దోమలు విజృంభిస్తున్నాయి. దీనివల్ల విషజ్వరాలు వ్యాప్తి చెందే వీలుంది. ఇంటి పరిసరాలను ప్రతి ఒక్కరూ పరిశుభ్రంగా ఉంచుకోవాలి. నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఫ్రైడేని ప్రతి ఒక్కరూ డ్రైడేగా పాటించాలి' అని కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించారు. తిరుపతి జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన తొలిసారి తిరుపతి నగరంలో ఆకస్మికంగా పర్యటించారు. తిరుపతి నగరంలోని స్కావెంజర్స్ కాలనీ, దేవేంద్ర థియేటర్ రోడ్డు, శివజ్యోతి నగర్ ప్రాంతాల్లో ఆయన కమిషనర్ అదితిసింగ్, డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీహరితో కలిసి పర్యటించారు. పారిశుద్ధ్య నిర్వహణపై ఆరా తీశారు. శివజ్యోతి నగర్‌లో డెంగీ కేసు నమోదు కావడంతో ఆ ప్రాంతాన్ని తనిఖీ చేశారు. పారిశుద్ధ్య నిర్వహణకు అక్కడ తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. స్కావెంజర్స్ కాలనీలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉండడం పై కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్కడ చూసినా నీటి నిల్వలు, మురుగు ప్రవాహాలు, కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోవడంపై మండిపడ్డారు. అక్కడి శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను ఫ్రైడే డ్రైడే అంటే ఏంటో తెలుసా అంటూ ప్రశ్నించారు. సరైన సమాధానం చెప్పకపోవడంతో సానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై అసహనం వ్యక్తం చేశారు. 'నీకే తెలియలేదు.. ఇక నీ కింది స్థాయి సిబ్బందికి ఏమి తెలుస్తుంది?. క్షేత్రస్థాయిలో ఏ మేరకు పని చేస్తున్నావో అర్థం అవుతోంది?. నీకు ఫస్ట్ అండ్ లాస్ట్ వార్నింగ్. వీధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సస్పెండ్ చేస్తా'నంటూ హెచ్చరించారు. అక్కడే ఓ గర్భిణిని పలకరించారు. అంగన్‌వాడీలో అందించే పౌష్టికాహారం పై ఆరా తీశారు. కోడిగుడ్డు నాణ్యతగా ఉండడం లేదని ఆమె కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో అంగన్‌వాడీ టీచర్లను పిలిచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఫ్రైడే రోజున డ్రైడేను పాటించాలని ఆయన సూచించారు. ఈ విషయంపై విస్తృతంగా అవగాహన కల్పించాలని చెప్పారు. మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు మోహన్, డాక్టర్ అన్వేష్, చంద్రశేఖర్, వెంకటరామిరెడ్డి, సానిటరీ సూపర్‌వైజర్లు చెంచయ్య, సుమతి పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేద్దాం

తిరుపతి అర్బన్: అధికారులు అంకితభావంతో పనిచేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఆయన శుక్రవారం ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదికగా చేపడుతున్న కార్యక్రమంలో అందుకున్న ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలని సూచించారు. డయేరియా నివారణకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటి సమస్యలు తలెత్తకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఐసీడీఎస్ అధికారులు పిల్లలకు పౌష్టికాహారాన్ని సక్రమంగా అందించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. సమీక్షలో డీఆర్వో పెంచల కిషోర్‌తోపాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.